ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 21 జూన్ 2024

డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, జూన్ 20: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థుల ఆరో సెమిస్టర్ (ఇంటర్న్‌షిప్) ఫలితాలను గురువారం విడుదల చేశారు. బీఏ, బీబీఏ, బీసీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో మొత్తం 9,832 మంది హాజరుకాగా 9,777 మంది ఉత్తీర్ణులై, 99.44 ఫలితాలు సాధించారు. బీఈడీ 3వ సెమిస్టర్‌కు 1,027మంది హాజరుకాగా 875 మంది ఉత్తీర్ణులై 85.2 శాతం ఫలితాలు సాధించారు. ఫలితాల వివరాలను జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉన్నట్టు పరీక్షల విభాగం డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు.

- ఐదేళ్లుగా వైసీపీ ఆర్భాటాలు
- నిధుల లేమితో నిలిచిన పనులు
- ప్రభుత్వ పాఠశాలల్లో చాలని గదులు
- ఆరుబయట తరగతులు

నాడు-నేడు.. ఎక్కడికక్కడే..!



శిథిలావస్థలో పరశురాంపురం జీపీఎస్ పాఠశాల

(మెళియాపుట్టి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో 'నాడు-నాడు' పథకంతో పాఠశాలల రూపురేఖలు మారుస్తామన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కానీ క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగక.. విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత విద్యాసంవత్సరం ముగిసే నాటికే రెండో విడత 'నాడు-నేడు' పనులు పూర్తిచేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. కానీ ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ ఏడాది విద్యాసంవత్సరం ముగిసే నాటికి పనులు పూర్తి చేసి.. మిగిలినవి మూడో విడతలో చేపడతామని వైసీపీ నేతలు చెప్పారు. కాగా.. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో.. 'నాడు-నేడు'పనులపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది చర్చనీయాంశమవుతోంది.

ఇదీ పరిస్థితి..

గత వైసీపీ ప్రభుత్వం 'నాడు-నేడు' పథకంతో విద్యాశాఖలో సమూల మార్పులు చేస్తున్నట్టు విస్తృత ప్రచారం చేసింది. కానీ, పనులు మాత్రం ఆశించినస్థాయిలో చేపట్టలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో తొలివిడత 1,247 పాఠశాలలకు రూ.289.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో పాఠశాలలకు రంగులు వేసి మెరిపించారు. కాగా.. బెంచీలు, విద్యుత్ పరికరాల టెండర్లలో లక్షలాది రూపాయల అవినీతి జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. రెండో విడతలో 1,096 పాఠశాలలకు సంబంధించి రూ.427.73 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో రెండేళ్ల నుంచి ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. ప్రభుత్వం తర్వాత బిల్లులు మంజూరు చేస్తుందని భావించి.. కొన్నిచోట్ల వైసీపీ నాయకులు గొప్పలకు పోయి అప్పుచేసి సొంత నిధులతో పాఠశాలల్లో పనులు చేపట్టారు. కాగా ప్రస్తుతం ప్రభుత్వం మారి.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో తమ బిల్లులు వస్తాయో.. రావోనని ఆందోళన చెందుతున్నారు.



రింపి జీపీఎస్ పాఠశాలలో గచ్చులు ఇలా..

గిరిజన పాఠశాలలు అంతేనా?

మూడో విడత అధికంగా గిరిజన పాఠశాలలకు నిధులు మంజూరు చేస్తామని వైసీపీ ప్రభుత్వం చెప్పింది. కాగా.. ఇంతలో ఎన్నికలు రాగా.. వైసీపీ ఓడిపోయింది. ప్రస్తుతం ఐటీడీఏ పరిధిలో ఉన్న 101 పాఠశాలల్లో పరిస్థితి అధ్వానంగా తయారైంది. గచ్చులు గుంతలుగా ఉండడంతో విద్యార్థులు నేలపై కూడా కూర్చొని చదవలేని దుస్థితి నెలకొంది. పైన శ్లాబులు పెచ్చులూడుతుండడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. మెళియాపుట్టి మండలం రింపి జీపీఎస్ పాఠశాల గచ్చు ఎక్కడికక్కడ ఊడి.. గుంతలమయంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పరశురాంపురంలోని జీపీఎస్ పాఠశాల శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఆ భవనంలోనే తరగతులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. చాపర పాఠశాల భవన నిర్మాణ పనులు మూడేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. అలాగే అధికంగా జిల్లాపరిషత్ పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మరికొన్నిచోట్ల తరగతి గదులు చాలక ఆరుబయటే బోధన సాగిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో పనులు కూడా చేపట్టే పరిస్థితి లేదు. పాఠశాలల్లో పనులు పూర్తిచేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై మెళియాపుట్టి ఎంఈవో-2 మల్లారెడ్డి పద్మనాభం వద్ద ప్రస్తావించగా.. "గత ప్రభుత్వం చేపట్టిన 'నాడు-నేడు' పనులపై ప్రస్తుతం ఎటువంటి ఆదేశాలు రాలేదు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిగతా పనులు చేపడతామ"ని తెలిపారు.



మూడేళ్లుగా పనులు సాగుతున్న చాపర పాఠశాల భవనం



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

వ్యవసాయాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- 1.82 లక్షల హెక్టార్లలో సాగు లక్ష్యం: కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్


కలెక్టరేట్, జూన్ 20: జిల్లాలో వ్యవసాయాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయం.. హార్టికల్చర్, సెరీకల్చర్, పశుసంవర్థక, ఫిషరీస్, మార్కెటింగ్, కోఆపరేటివ్, ఏపీఎంఐపీ, వంశధార తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎరువులు, విత్తనాల పంపిణీతోపాటు వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని ఆదేశించారు. 'జిల్లాలో ఈ ఏడాది 1,82,325 హెక్టార్లలో పంటలు సాగు లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఇందులో వరి 1,61,500 హెక్టార్లు, మొక్కజొన్న 14,000 హెక్టార్లలో సాగు చేయిస్తాం. 38,882 క్వింటాళ్ల విత్తనాలకుగాను 31,699 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే 16,904 క్వింటాళ్ల పంపిణీ పూర్తిచేశాం. జిల్లాకు 1,18,820 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించగా.. ఇప్పటివరకు 33,000 మెట్రిక్ టన్నులు పంపిణీకి సిద్ధం చేశాం. అర్హులైన రైతులందరికీ పంట రుణాల మంజూరుకు బ్యాంకులు సహకరించాలి. పీఎం కిసాన్ కింద జిల్లాలో 2.29 లక్షల మంది రైతులకు రూ.45.8కోట్ల నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామ'ని తెలిపారు. వంశధార ప్రాజెక్టుకు సంబంధించి నీటి నిల్వ వివరాలు, తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల్లో ప్రస్తుత నీటి నిల్వ పరిస్థితులు, కార్యాచరణపై చర్చించారు. పశుసంవర్థక శాఖ ద్వారా అమలవుతున్న పథకాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, వ్యవసాయాధికారి కె.శ్రీధర్, పశుసంవర్థక శాఖ జేడీ జయరాజు, వంశధార ఎస్ఈ రాంబాబు, నీటిపారుదల శాఖ ఎస్ఈ సుధాకర్, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డీఎం రమణి, సెరీకల్చర్ అధికారి రాజేంద్ర ప్రసాద్‌బాబు, ఉద్యానశాఖ అధికారి ప్రసాదరావు, మార్కెటింగ్ ఏడీ గంగాధర్ పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచే పారిశుధ్య పనులు

కలెక్టరేట్, జూన్ 20: గ్రామస్థాయి నుంచే పారిశుధ్య నిర్వహణ పనులు ప్రారంభించాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైనా మలేరియా, డెంగ్యూ కేసులు గుర్తిస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇటీవల పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో వచ్చిన మలేరియా కేసుపై తీసుకున్న చర్యలేమిటని ప్రశ్నించారు. ఇంటింటా సర్వే చేపట్టాని ఆదేశించారు. గతేడాది 54 డెంగ్యూ, 11 మలేరియా కేసులు వచ్చాయని డీపీవో వేంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకూ ఆరు డెంగ్యూ రెండు మలేరియా కేసులు నమోదయ్యాయని వివరించారు. కాగా.. గ్రామస్థాయిలో సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే పారిశుధ్య సమస్య ఉండదని కలెక్టర్ తెలిపారు. అన్ని హాస్టళ్లలో రెగ్యులర్‌గా ఫాగింగ్ చేయాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ప్రసాదరావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, మునిసిపల్ కమిషనర్లు, పరిశ్రమల శాఖ జీఎం ఉమామహేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ అధికారిణి అనూరాధ, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకూ.. స్టూడెంట్ కిట్

- కొత్త ప్రభుత్వం.. సరికొత్త పథకం
- పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, బ్యాగుల పంపిణీకి సన్నాహాలు
- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో హర్షం



మందస కళాశాలలో ఇంటర్ విద్యార్థులు..

(హరిపురం)

కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం.. సరికొత్త పథకంతో విద్యార్థులను ఆదుకుంటోంది. విద్యార్థి దశలో ఎంతో కీలకమైన ఇంటర్ విద్యకు భరోసా ఇవ్వనుంది. ఒకటి నుంచి పదోతరగతి విద్యార్థులకు అందజేస్తున్న స్టూడెంట్ కిట్‌ను ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యార్థులకూ అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేయగా.. ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. జూలై నాటికి విద్యార్థులకు ఉచితంగా బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేయనున్నారు. దీనిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులతోపాటు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ ఇంటర్ విద్యార్థులు సుమారు 6,400 మంది విద్యనభ్యసిస్తున్నారు. అలాగే 12 ఆదర్శ పాఠశాలలు, 12 ప్లస్ టూ హైస్కూళ్లు, 18 కేజీబీవీల్లో ఇంటర్ విద్య అమలు చేస్తున్నారు. వీటిలో సుమారు 4,600 మంది చదువుతున్నారు. గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ కళాశాలల్లో మరో 2వేలమంది ఉన్నారు. పేద కుటుంబాలకు చెందిన వీరంతా.. పాఠ్యపుస్తకాలు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ పుస్తకాలు కొనుగోలు చేయాలంటే రూ.1,800 వరకు ఖర్చుచేయాల్సి ఉంది. దీంతోపాటు ల్యాబ్, ప్రాక్టికల్స్ రికార్డులకు ఏటా రూ.1600 వరకు ఖర్చవుతుంది. హెచ్ఈసీ, సీఈసీ విద్యార్థులు సుమారు రూ.వెయ్యి వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రవేశ రుసుము కూడా పెంచడంతో ఆయా కుటుంబాలపై భారం పడుతోంది. గత ఐదేళ్ల నుంచి విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతం. ప్రైవేటులో చదివే వారికీ అకాడమీ పుస్తకాలు దొరకటం లేదు. దీంతో ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అధ్యాపకులకు సైతం పాఠ్య పుస్తకాల కొరత వేధిస్తోండడం గమనార్హం. గత్యంతరంలేని పరిస్థితుల్లో గతేడాది ఉపయోగించిన పుస్తకాలు, జిల్లా కేంద్రంలోని పాత పుస్తకాలు తెప్పించుకొని బోధన సాగిస్తున్నారు. కొంతమంది విద్యార్థులు సీనియర్ల నుంచి పాత పుస్తకాలు తీసుకొని చదువుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు స్టూడెంట్ కిట్ రూపంలో బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేయాలని నిర్ణయించడంతో ఎంతో ఊరట లభించనుందని విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధ్యాపకులు సకాలంలో సిలబస్ పూర్తిచేసి.. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరం..



ప్రభుత్వ నిర్ణయం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరం. అకాడమీ పుస్తకాలు తగినంత స్థాయిలో ముద్రణ జరగక గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగేది. వేల రూపాయిలు చెల్లిస్తామన్నా.. కొత్తవి దొరకక పాత పుస్తకాలే దిక్కుగా మారిన దశలో ప్రభుత్వం ఉచితంగా అందించటం శుభ సంతోషకరం.

-సీహెచ్ శరత్‌బాబు, జూనియర్ లెక్చరర్ల రాష్ట్ర సలహాదారు

ప్రతిపాదనలు సిద్ధం..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ ఆనందదాయయం. అధికారుల ఆదేశాలతో దీనిపై బోర్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రస్తుతం పాత పుస్తకాలతోనే బోధన కొనసాగిస్తున్నాం. మొదటి ఏడాది అడ్మిషన్లు పూర్తయ్యాక పూర్తిస్థాయిలో పుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

-కోట ప్రకాశరావు, డీవీఈవో, శ్రీకాకుళం

మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు..



ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు అందించటం గొప్ప నిర్ణయం. దీనికిగాను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఇప్పటివరకు కేవలం రాసుకున్న నోట్సులపై ఆధారపడ్డాం. తరగతికి ఒక అకాడమి పుస్తకం ఉండటం గొప్ప. అలాంటింది అందరికీ ఉచితంగా పుస్తకాలు అందజేయడం హర్షణీయం.

-డి.హేమ మజారి, ద్వితీయ బైపీసీ, మందస

అన్నదాతకు మద్దతుగా..

- క్వింటా ధాన్యం బస్తాకు రూ.117 పెంపు
- జిల్లా రైతులకు రూ.120కోట్ల మేర లబ్ధి



టెక్కలి, జూన్ 20: అన్నదాతలు పండించే వరి ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచింది. ఈ ఏడాది క్వింటాకు రూ.2,300 ప్రకటించింది. దీంతో గతేడాది కన్నా క్వింటాకు రూ.117 చొప్పున అదనపు ఆదాయం లభించింది. జిల్లాలో రైతులకు రూ.120కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. జిల్లాలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో సుమారు 4లక్షల ఎకరాల్లో, రబీ సీజన్‌లో 30వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. ఖరీఫ్‌లో సుమారు 9లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, రబీలో 60వేల క్వింటాళ్ల మేర ధాన్యం దిగుబడి రానుందని వ్యవసాయశాఖ అధికారుల ప్రాథమిక అంచనా. ఈ ఏడాది సన్నరకాల విత్తనాల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. సాంబ, సీఆర్, ఆర్‌జీఎల్, రాణితో పాటు కనక్‌ప్లస్, సంపద స్వర్ణ, ఇండిగో333, అమూల్య, జైశ్రీరామ్, 1061, 1010, 1121, 1153 తదితర విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. విత్తనాలు, ఎరువుల ధరలు పెరిగాయని రైతులు ఆరోపిస్తున్నారు. దుక్కులు, దమ్ము, ఉబాలు, కలుపుతీత, పురుగు మందుల పిచికారీ, పంట నూర్పునకు సంబంధించి కూలీల భారం కూడా తడిసిమోపెడు అవుతోందని వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇంకాస్త మద్దతు ధర పెంచితే బాగుండేదని అభిప్రాయపడుతున్నారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా

- ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైం, జూన్ 20: జిల్లాలోని పూర్తిస్థాయిలో మాదక ద్రవ్యాలు అక్రమ రవాణాను నియంత్రించాలని పోలీసు అధికారులను ఎస్పీ రాధిక ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ 'కొత్త వ్యక్తుల సమాచారం సేకరణ చేపట్టాలి. అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచాలి. లాడ్జీలు, వాహనాలను విస్తృతంగా తనిఖీ చేసి నేర నివారణ చర్యలు తీసుకోవాలి. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. గ్రేవ్ కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై చార్జిషీట్ కోర్టులో దాఖలు చేయాల'ని సూచించారు. జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యాయని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ డా.జి ప్రేమ్ కాజల్, డీఎస్పీలు డి.బాలచంద్రారెడ్డి, వై.శృతి, నాగేశ్వరరెడ్డి, ఏ.త్రినాథరావు, కె.శ్రీనివాసన్, ఎల్.శేషాద్రి, ఏవో గోపీనాథ్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక, హాజరైన పోలీసులు

పిడుగుపాటుకు ఇద్దరు రైతులు మృతి

- రెండు ఆవులు కూడా..



సత్యనారాయణ (ఫైల్)

బూర్జ, జూన్ 20: బూర్జ మండలంలో గురువారం పిడుగుపాటుకు గురై ఇద్దరు రైతులు మృతి చెందగా.. ఒకరు అస్వస్థతకు గురయ్యారు. రెండు ఆవులు కూడా ప్రాణాలు కోల్పోయాయి. వివరాల్లోకి వెళితే.. టీడీఆర్ పేట (అయ్యవారిపేట)కు చెందిన చోడవరపు సత్యనారాయణ (30), కటకమయ్యపేటకు చెందిన దేవరపల్లి బారికయ్య (72) గురువారం పిడుగుపాటుతో మృతి చెందారు. గురువారం సాయంత్రం టీడీఆర్ పేటలో చెరువు వద్ద సత్యనారాయణ ఆవులకు మేపుతుండగా ఉరుములు, మెరుపులతో పిడుగులు పడ్డాయి. దీంతో సత్యనారాయణతోపాటు రెండు ఆవులు కూడా ప్రాణాలు కోల్పోయాయి. అదే ప్రాంతంలో ఉన్న మామిడి జగదీష్ అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు ఆయనను శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్ - రిమ్స్)కు తరలించగా.. ప్రాణాపాయం తప్పింది. సత్యనారాయణ మృతి చెందడంతో తల్లిదండ్రులు అచ్చెన్నమ్మ, సూర్యనారాయణ బోరున విలపించారు. అలాగే కటమయ్యపేటలో దేవరపల్లి బారికయ్య వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బారికయ్యకు భార్య అమ్మన్నమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. బారికయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలాగే లాభాం గ్రామం వద్ద ఒక ఇంటి పెరటిలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడడంతో దగ్ధమైపోయింది. ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



సత్యనారాయణ, బారికయ్య మృతదేహాలు

కళాశాలలో చెలరేగిన వివాదం

- విద్యార్థుల మధ్య కొట్లాట..
- ఆరుగురికి గాయాలు

నరసన్నపేట, జూన్ 20: నరసన్నపేటలోని ఒక కళాశాలలో భోజన విరామ సమయంలో విద్యార్థుల మధ్య జరిగిన స్వల్ప గలాట కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల వివరాలు మేరకు.. కరగాం గ్రామానికి చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి షర్టు కాలర్‌ను నరసన్నపేట పురుషోత్తనగర్‌కు చెందిన ఫస్టియర్ విద్యార్థి పట్టుకోవడాన్ని కొందరు సెకండియర్ విద్యార్థులు చూసి మందలించారు. ఈ విషయాన్ని ఫస్టియర్ విద్యార్థి(కాలర్ పట్టుకున్న వ్యక్తి) తన సోదరుడికి చెప్పాడు. దీంతో కళాశాల విడిచిపెట్టిన తర్వాత అతని సోదరుడు తన స్నేహితులతో వచ్చి రెడ్డికపేటకు చెందిన సెకండియర్ విద్యార్థులపై చేయి చేసుకున్నాడు. ఈ విషయాన్ని రెడ్డికపేట విద్యార్థులు తమ గ్రామస్థులకు చెప్పారు. దీంతో గ్రామానికి చెందిన కొందరు యువకులు గొట్టిపల్లి అండర్ పాస్ వద్ద ఫస్టియర్ విద్యార్థి సోదరుడు, అతని స్నేహితులను ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాలు కొట్లాటకు దిగాయి. సమాచారం తెలుసుకున్న హెచ్‌సీ దాలినాయుడు ఘటనా ప్రాంతానికి చేరుకుని అడ్డుకున్నారు. గాయపడిన వారిలో ఇద్దరు ప్రభుత్వ ఆసుపత్రిలో, మరో ఇద్దరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెడ్డికపేటకు చెందిన ఇద్దరు విద్యార్థులు కూడా స్వల్పంగా గాయపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అసిరినాయుడు తెలిపారు.

సీఐటీడీలో మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- ఫుల్ టైం మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. హైదరాబాద్ సీఐటీడీ క్యాంపస్‌లో ప్రతి సోమ, మంగళ, బుధ వారాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు; ఓయూ ఇంజనీరింగ్ కాలేజ్(మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్) క్యాంపస్‌లో ప్రతి గురు, శుక్ర, శని వారాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం అయిదున్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. ఉస్మానియా యూనివర్సిటీ మాస్టర్స్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

స్పెషలైజేషన్‌లు

- మెకానికల్ క్యాడ్/క్యామ్
- టూల్ డిజైన్
- డిజైన్ ఫర్ మాన్యుఫాక్చర్
- మెకట్రానిక్స్

అర్హత: ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్/ఆటొమొబైల్ ఇంజనీరింగ్/ఏరోనాటికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రెగ్యులర్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.41,000; స్పాన్సర్డ్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.51,000 చెల్లించాల్సి ఉంటుంది. అటానమస్ ఫీజు కింద రూ.9,770; కాషన్ డిపాజిట్ కింద రూ.1,000 చెల్లించాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 14
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** citdindia.org

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/BeB8vjvలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

నల్సార్‌లో సర్టిఫికేషన్ కోర్సు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)- షార్ట్ టర్మ్ సర్టిఫికేషన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ప్రధానాంశం 'సైబర్ క్రైమ్స్ ఇన్వెస్టిగేషన్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్ యూజింగ్ ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్(ఓసింట్) టూల్స్ అండ్ టెక్నిక్స్'. ఈ కోర్సుకి సెంటర్ ఫర్ సైబర్ లాస్ అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్ సహకారం అందిస్తోంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 70 సీట్లు ఉన్నాయి. నల్సార్ విద్యార్థుల కోసం 10 సీట్లు ప్రత్యేకించారు.

- **కోర్సు ఫీజు:** రూ.6000
- **ప్రోగ్రామ్ సెషన్స్:** జూలై 5 నుంచి 7 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 4
- **వెబ్‌సైట్:** nalsar.ac.in



ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ గురువారం 'విశ్వంభర' చిత్రం సెట్స్‌లో చిరంజీవితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దుర్గేశ్‌ను చిరంజీవి శాలువా కప్పి సత్కరించారు. మంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చడంలో దుర్గేశ్ విజయం సాధించాలని చిరంజీవి ఆకాంక్షించారు.



యాభై ఏళ్లుగా తెలుగు చిత్రపరిశ్రమకు ఎనలేని సేవ చేస్తూ, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి అధ్యక్షుడిగా సేవలు అందిస్తూ, హిందూపురం నుంచి మూడోసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన నందమూరి బాలకృష్ణను తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి, తెలుగు నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలసి అభినందించారు.

మూడు ప్రపంచాల మధ్య జరిగే కథ



ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ వంటి టాప్ స్టార్స్ నటించిన సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ' ప్రమోషనల్ కంటెంట్ ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తికలిగిస్తోంది. అలాగే దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్న 'ఎపిక్ జర్నీ ఎపిసోడ్ వన్' కుతూహలాన్ని మరింత పెంచింది. తాజాగా గురువారం రెండో ఎపిసోడ్‌ను విడుదల చేశారు. ఇందులో దర్శకుడు మాట్లాడుతూ 'మూడు ప్రపంచాల మధ్య జరిగే కథ ఇది. ఒక్కో వరల్డ్ నుంచి ఒక్కో థాట్ ప్రాసెస్‌తో ఫ్యూచరిస్టిక్‌గా బిల్డప్ చేశాం. ఇందులో కాశీ మొదటిది. ఈ ప్రపంచంలో కాశీనే చివరి సిటీ అయితే ఎలా ఉంటుందన్న ఆలోచనతో 'కల్కి' స్క్రిప్ట్ మొదలు పెట్టాం. కలియుగం చివరిలో గంగానది ఎండిపోయిన తర్వాత కాశీ ఎలా ఉంటుంది, నాగరికత ఏ విధంగా ఉంటుంది అనే ఊహతో ఆ సిటీని క్రియేట్ చేశాం. ఇండియన్ ఆర్కిటెక్చర్, వెహికిల్స్, కరెన్సీ.. ఇలా అన్ని విషయాల్లో ఫ్యూచరిస్టిక్‌గా ఆ సిటీని రూపొందించాం. కాశీ పైన పిరమిడ్ ఆకారంలో ఉండే స్ట్రక్చర్ ఉంటుంది. దాన్ని మేం కాంప్లెక్స్ అంటాం. భూమిపై లేని నేచర్, యానిమల్స్, ఫుడ్.. అక్కడ ఉంటాయి. ఇదో రకం స్వర్గం అనుకోవచ్చు. మూడో ప్రపంచం శంబల. కాశీకీ, కాంప్లెక్స్‌కూ సంబంధం లేని ప్రపంచం అది. అక్కడ ఉన్న వారు కాంప్లెక్స్‌లో ఉన్నవారిని ఛాలెంజ్ చేస్తుంటారు. కల్కి అవతారం శంబలలో పుడుతుందనే నమ్మకం మన శాస్త్రాల్లో ఉంది. ఈ మూడు ప్రపంచాలు ఒకదానితో మరొకటి కలగలుస్తూ 'కల్కి' కథ నడుస్తుంది' అన్నారు.

థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో...



వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటిస్తున్న చిత్రం 'ద కానిస్టేబుల్'. ఆర్యన్‌సుభాన్ ఎస్.కే దర్శకత్వం వహిస్తుండగా, జగదీశ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇటీవలే పూర్తయింది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ "త్వరలోనే కానిస్టేబుల్ పాత్రతో.. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మీ ముందుకు వస్తున్నాను" అని చెప్పారు. "అద్భుతమైన కథ, ఆకట్టుకునే కథనం కుదిరిన సినిమా ఇది" అని నిర్మాత జగదీశ్ అన్నారు. "ఈ సినిమాలో వరుణ్ సందేశ్ నట విశ్వరూపం చూస్తారు" అని దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కే అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: వరప్రసాద్, కెమెరామెన్: హజరత్ షేక్, సంగీతం: సుభాశ్ఆనంద్.



తెలుగు నిర్మాతల హిందీ చిత్రం

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యాయి. ఈ రెండు సంస్థలు కలసి సన్నీడియోల్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టి.జి విశ్వప్రసాద్ నిర్మాతలు. తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. డైరెక్టర్‌గా హిందీలో ఆయనకు ఇది తొలి చిత్రం. భారీ బడ్జెట్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని మేకర్స్ గురువారం లాంచ్ చేశారు. ఈ నెల 22 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నారు. సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఎస్ థమన్, సినిమాటోగ్రఫీ: రిషి పంజాబీ.

సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నా



దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన 'మగధీర' చిత్రంలో ప్రతినాయకుడిగా అందరినీ మెప్పించిన దేవ్‌గిల్.. ఆ తర్వాత వరుస సినిమాల్లో అవకాశాలు కొట్టేసి, అనేక సార్లు ప్రతినాయకుడి పాత్రలు పోషించారు. ప్రస్తుతం ఆయన లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'అహో విక్రమార్క'. 'మా అబ్బాయి', 'రంగుల రాట్నం' ఫేమ్ చిత్ర శుక్లా హీరోయిన్‌గా నటిస్తున్నారు. పేట త్రికోటి దర్శకత్వంలో ఆర్తి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవ్‌గిల్ మాట్లాడుతూ "నన్ను ఇంతవరకూ మీరందరూ విలన్ పాత్రల్లోనే చూశారు. కానీ మీ అందరికీ ఈ సినిమాతో నేను సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నాను" అని చెప్పారు. "టెక్నికల్‌గా ఈ చిత్రం అద్భుతంగా ఉంటుంది" అని దేవ్‌గిల్ భార్య నిర్మాత ఆర్తి అన్నారు. "మంచి సినిమా చేశాం. ప్రేక్షకులందరూ ఈ సినిమాను ఆదరించాలి" అని దర్శకుడు పేట త్రికోటి కోరారు.

రాజీనామా చేయాలన్న వారిపై కేసు పెట్టండి

- వలంటీర్లతో మంత్రి అచ్చెన్నాయుడు
- ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

టెక్కలి, జూన్ 20: నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు తమ సమస్యలపై మంత్రికి అర్జీలు అందజేశారు. వైసీపీ నాయకుల బెదిరింపుతో తాము రాజీనామాలు చేశామని, మానవతా దృక్పథంతో మళ్లీ తమను వలంటీర్లగా కొనసాగించాలని టెక్కలికి చెందిన పలువురు వలంటీర్లు మంత్రిని కోరారు. 'గత ఐదేళ్లుగా జగనన్న.. జగనన్న అంటూ భజన చేయడం గుర్తుందా. ఎవరైతే మీ మెడపై కత్తిపెట్టి రాజీనామా చేయమన్నారో వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. అప్పుడు రండి చూద్దామంటూ' మంత్రి వలంటీర్లతో చెప్పారు. తమను ఆదుకోవాలని పలువురు చంద్రన్న బీమా మిత్రలు, ఉత్తరాంధ్ర తెలగ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలని ఆ సంఘ నాయకులు పి.వెంకటరమణ, శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని టెక్కలి, నందిగాం మండలాలకు చెందిన పినకాన అజయ్‌కుమార్, పోలాకి చంద్రశేఖర్ మంత్రికి అర్జీలు అందజేశారు. టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల్లో ఎత్తిపోతల పథకాల ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు, డీపీ ఆయిల్ చోరీకి గురైందని, వాటికి మరమ్మతులు చేపట్టి ఖరీఫ్‌కు సాగునీరు అందించాలని పలువురు రైతులు కోరారు. అలాగే, తమ సమస్యలపై విద్యార్థులు, రేషన్ డీలర్లు, ఆశవర్కర్లు, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు వినతులు అందజేశారు.


వలంటీర్లతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ఘనంగా భువనేశ్వరి పుట్టిన రోజు వేడుకలు

ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి పుట్టినరోజు వేడుకలను గురువారం మండల కేంద్రం ఎన్ఎన్‌పేటలోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి కేక్ కట్ చేశారు. నాయకులు వి.గోవిందరావు, కె.మన్మథరావు, కె.తిరుపతిరావు, జి.రాము, జి.గోవిందరావు, జె.మోహనరావు తదితరులు పాల్గొన్నారు. **కొత్తూరు:** నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను కొత్తూరు టీడీపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు స్వగృహంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. **పాతపట్నం:** స్థానిక టీడీపీ కార్యాలయంలో భువనేశ్వరి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు సైల బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.


ఎల్ఎన్‌పేట: కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

రెవెన్యూ సేవలను సద్వినియోగం చేసుకోండి



నరసన్నపేట: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కనకరావు

నరసన్నపేట: రెవెన్యూ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కనకరావు సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో రెవెన్యూ డే వేడుకలను నిర్వహించారు. రెవెన్యూ శాఖ అందించే అడంగళ్, 1బీ, పాస్‌పుస్తకం, తదితర సేవల గురించి వివరించారు. రిటైర్డు రెవెన్యూ అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో డీటీలు శరత్, గాయత్రీ, ఆర్ఐలు లోకేష్, అవినాశ్, సర్వేర్లు పాల్గొన్నారు. **పోలాకి:** రెవెన్యూ దినోత్సవం సందర్భంగా పోలాకిలో తహసీల్దార్ ఎస్.ఎల్.వి.ప్రసాద్ అధ్యక్షతన ఉత్తమ రైతు ఆవల పాపారావు, ఉత్తమ విశ్రాంత సర్వేయర్ చిన్నప్పన్న, ఉత్తమ వీఆర్వో అప్పలాచారిని సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేష్, మండల సర్వేయర్ బి.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు. **పలాసరూరల్:** స్థానిక తహసీల్దార్ ఆర్డీవో భరత్‌నాయక్, తహసీల్దార్ ఎస్‌వీఎస్ఎస్‌నాయుడు, ఏవో రామారావును రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో డీటీ లక్ష్మీనారాయణ, సర్వేయర్ గిరి, ఆర్ఐ నిరంజన్, వీఆర్వోలు ఖగేశ్వరనాయుడు, రాజేష్ పాల్గొన్నారు. **వజ్రపుకొత్తూరు:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డే వేడుకలను తహసీల్దార్ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో డీటీ వి.గిరిరాజు, ఆర్ఐ పవిత్ర, తదితరులు పాల్గొన్నారు. **పాతపట్నం:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాదరావు ఆధ్వర్యంలో రెవెన్యూ డేను నిర్వహించారు. రిటైర్డ్ వీఆర్వో కొంచాడ శేషగిరిరావు, ఓఎస్ జి.లక్ష్మీనారాయణను సన్మానించారు. డీటీ ప్రసాదరావు, ఎన్నికల డీటీ రమణ, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రసన్నలత

సంతబొమ్మాళి: న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి డీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. గురువారం బోరుభద్రలో ఏపీ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీ చింతాడ చిన్నారావు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేసి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వాతావరణం కాలుష్యం జరగకుండా మొక్కలను నాటాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. న్యాయసంఘం ద్వారా ఉచిత న్యాయ సలహాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసరావు, సర్పంచ్ ప్రతినిధి బుసకల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించరూ!

పోలాకి: తమ గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గుప్పెడుపేట, రాజారాంపురం, గుల్లవానిపేట, కంబాలవానిపేట, కొత్తరేవు, తదితర గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. తాగునీటి పథకాలు ఉన్నా పని చేయడం లేదని, దీంతో కుళాయిల ద్వారా నీరు రావడం లేదని వాపోతున్నారు. ఈ ఏడాది ఎండలు మండుతున్నాయని, గొంతులు తడుపుకునేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి క్యాన్లలను కొనుగోలు చేయాల్సి వస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. గ్రామీణ నీటివిభాగ అధికారులు పరిశీలించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ


విద్యార్థులకు బ్యాగులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న హేమబాబుచౌదరి

వజ్రపుకొత్తూరు: మండలంలోని చినవంక పాఠశాలలో చదవుతున్న 21 మంది విద్యార్థులకు గురువారం బ్యాగులు, పాఠ్యపుస్తకాలను పీఏసీఎస్ మాజీ చైర్మన్, సీనియర్ టీడీపీ నాయకుడు దువ్వాడ హేమబాబు చౌదరి అందించారు. ప్రభుత్వ పాఠశాలలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చీగటి ధర్మారావు, నాయకులు సింహాచలం, రాంకీ, నగేష్ ప్రసాద్ పాల్గొన్నారు. అంతకుముందు గుల్లలపాడులో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో తిరుమలరావుతో కలసి పరిశీలించారు.

శ్రీముఖలింగంలో వైభవంగా మైనాకోత్సవం


శ్రీముఖలింగం పొలిమేరల్లో మైనాకోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: శ్రీముఖలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి మైనాకోత్సవాన్ని దేవదాయశాఖ సిబ్బంది, అర్చకులు ఘనంగా నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం నిర్వహించి గ్రామం పొలిమేరలోని పాఠశాల సమీపం వద్దకు చేర్చారు. అక్కడ గడ్డితో (పరమేశ్వరుని) ఇంటిని ఏర్పాటు చేసి మైనాకోత్సవం నిర్వహించారు. పార్వతీదేవిని పరమేశ్వరుడు వివాహం చేసుకోవడం పార్వతీదేవి సోదరుడైన మైనాకుడుకి ఇష్టం లేదని, దీంతో మైనాకుడు తన సేవకులతో రాత్రివేళ పరమేశ్వరుని ఇంటికి నిప్పంటించి దహనం చేశాడని, దానినే మైనాకోత్సవం అంటారని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, చైతన్య, అప్పారావు, శివ, శ్రీకృష్ణ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పానీహాటీ ఉత్సవం..

పర్లాం మాకివలస గ్రామంలో గురువారం పానీహాటీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వెలసిన సుభద్ర, బలభద్ర సహిత జగన్నాథస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. వంశధార నదిలో ఉత్సవమూర్తులకు పుణ్యస్నానాలు ఆచరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుక్కల మధ్యే విద్యార్థుల భోజనాలు


విద్యార్థుల భోజనాల వద్ద ఉన్న కుక్కలు

టెక్కలి: టెక్కలి జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో కుక్కల సంచారం ఎక్కువైంది. వాటి మధ్యే విద్యార్థులు భోజనాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇక్కడ ఆరు నుంచి పదో తరగతి వరకు సుమారు 640మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో కుక్కలు కూడా తిష్టవేశాయి. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్న సమయంలో వారి మధ్యనే సంచరిస్తున్నాయి. దీంతో భోజనాలు చేసేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. కుక్కలకు తరలించే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి: ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం మాకివలస గ్రామంలో రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సాగునీరు, విత్తనాలు, పురుగు మందులు సకాలంలో అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వంశధార శివారు ప్రాంతాలకు సాగునీరు అందిచేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ రవీంద్రభారతి, ఎంపీపీ ఆరంగి మురళీ, టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, ఎంపీటీసీ వైవీ నాయుడు, ఏవో సునీత, నాయకులు యాళ్ల వేణుగోపాలరావు, చింతు రామారావు, రావాడ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరు అందిస్తాం


టెక్కలిపాడు వద్ద 24 ఎన్‌బీసీ కాలువలో పూడికతీత పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు: శివారు వ్యవసాయ భూములకు సాగునీరందించి రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. టెక్కలిపాడు వద్ద 24ఆర్ ఎన్‌బీసీ కాలువలో పూడికతీత పనులను గురువారం ఆయన ప్రారంభించారు. పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి ఖరీఫ్ సీజన్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని వంశధార అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నాయకులు పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు, పిరియా వెంకటరావు, గుండ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామికి ఎమ్మెల్యే పూజలు

తలసముద్రం(పోలాకి): తలసముద్రం గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దంపతులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుడు రమణశర్మ ఆలయ మర్యాదలతో బగ్గు దంపతులకు స్వాగతం పలికారు. శుక్రవారం ఆయన శాసన సభలో అడుగిడుతున్న నేపథ్యంలో వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారని టీడీపీ పార్టీ అధ్యక్షుడు మిరియబిల్లి వెంకట అప్పలనాయుడు, నాయకులు బైరి భాస్కరరావు, ప్రగడ సూరిబాబు తెలిపారు.

గరీబుల గెడ్డ పరిశీలన

సంతబొమ్మాళి: గరీబుల గెడ్డను వంశధార అధికారులు గురువారం పరిశీలించారు. సాగునీటి కాలువల్లో పూడికలు తీయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించిన నేపథ్యంలో వంశధార నరసన్నపేట ఈఈ ప్రదీప్, డీఈ బగ్గు సత్యనారాయణ, అప్పలరెడ్డి కోటబొమ్మాళి మండలం బడ్డిపేట నుంచి సంతబొమ్మాళి మండల కొల్లిపాడు రామసాగరం వరకు పది కిలోమీటర్ల గరీబుల గెడ్డ కాలువను పరిశీలించారు. అలాగే 25ఆర్ మేఘవరం వంశధార కాలువను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీడీపీ అధికార ప్రతినిధి అప్పిని వెంకటేష్, వంశధార మేఘవరం డిస్ట్రిబ్యూటరీ మాజీ చైర్మన్ కర్రి రామిరెడ్డి, సూరాడ ధనరాజ్, బుచ్చ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపుపై అశ్రద్ధ వద్దు


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

హిరమండలం: కంటి చూపుపై అశ్రద్ధ వద్దని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు అన్నారు. గురువారం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పుట్టిన రోజు సందర్భంగా బుచ్చిబాబు ఆధ్వర్యంలో హిరమండలం సచివాలయం-3 వద్ద శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 76 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 32 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో టి.రామారావు, నాయకులు బర్రి సురేష్, యాళ్ల నాగేశ్వరరావు, దారపు డిల్లేశ్వరరావు, గోళ్ల సింహాచలం, పి.శ్రీధర్, పి.సంతోష్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి


ర్యాలీ చేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో మల్లారెడ్డి పద్మనాభం కోరారు. గురువారం మెళియాపుట్టిలో మనం బడికి పోదాం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘుపతి, మమత, ఖగేశ్వరరావు, జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని అభినందించిన ఎంఈవో

జలుమూరు (సారవకోట): పదో తరగతి ఫలితాల్లో జిల్లాస్థాయిలో నాల్గో స్థానంలో నిలిచిన బుడితి ఉన్నత పాఠశాలకు చెందిన మాసవరపు మధుశ్రీని ఎంఈవో ఎంపీ రమణ గురువారం అభినందించారు. రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పి.రామరాజు మధుశ్రీకి నగదు పురస్కారం అందించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 భూలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు బి.మాధవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన దుర్గారావు

వజ్రపుకొత్తూరు: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను జనసేన పార్టీ పలాస సమన్వయకర్త వి.దుర్గారావు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పొత్తులో భాగంగా అందరికి పోటీచేసే అవకాశం రాలేదని పవన్ తనతో చెప్పినట్లు దుర్గారావు తెలిపారు.

టీడీపీ గెలుపుతో అక్కుపల్లిలో సంబరాలు



వజ్రపుకొత్తూరు: రాష్ట్రంలో టీడీపీ గెలుపొందడంతో అక్కుపల్లిలో గురువారం మంకినమ్మ సంబరాలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు ఆధ్వర్యంలో మహిళలు ముర్రాటలతో అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ, జనసేన నాయకులు పూజలు నిర్వహించారు. నాయకులు సింగుపల్లి బాలకృష్ణ పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి: మండలంలోని ఎర్రమనుగూడ గ్రామంలో గురువారం ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి 550 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సినట్లు ఎస్ఈబీ ఎస్ఐ కేఎస్ గణేష్ తెలిపారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

పలాస: మున్సిపాలిటీలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ టి.నాగేంద్రకుమార్ ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో పారిశుధ్య సూపర్‌వైజర్లు, సచివాలయ పారిశుధ్య ఉద్యోగులతో సమీక్ష నిర్వ హించారు. పారిశుధ్యం నిర్వహణపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోందని తెలిపారు. వారం రోజుల్లో చెత్త సమస్య లేకుండా చూడాలని, ప్రతి వార్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

మబగాం(పోలాకి): మబగాంలో ఎంపీటీసీ, సర్పంచ్, గ్రామపెద్ద కాయరవి, కోడూరులో కరుకోల రమేష్, కల్లి లక్ష్మణరావు చేతుల మీదుగా రైతులకు రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. శుక్రవారం మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు అందజేస్తామని ఏవో చిరంజీవి తెలిపారు.

మొబైల్స్‌కు సెక్యూరిటీ తప్పనిసరి: ఎస్పీ



బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైం: మొబైల్ ఫోన్లు వాడే ప్రతీ ఒక్కరూ తమ ఫోన్లకు లాక్ అండ్ సెక్యూరిటీ తప్పనిసరిగా వేసుకోవాలని ఎస్పీ రాధిక సూచించారు. అందుబాటులో ఉన్న కొత్త సాఫ్ట్‌వేర్ల ద్వారా ఫోన్లలో ఉండే డేటాకు సెక్యూరిటీ వేసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్ కొనుగోలు చేసిన అనంతరం బిల్లు ఐఎంఈఐ నెంబర్ ఇతర వివరాలు భద్రంగా ఉంచుకోవాలన్నారు. విలువైన సమాచారాన్ని ఫోన్లు ఉంచకుండా జాగ్రత్త వహించాలన్నారు. జిల్లాలోని మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు వాటిలో 72 మొబైల్స్ ట్రేస్ చేసి జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ రాధిక అందజేశారు. ఇప్పటి వరకు 518 ఫోన్లు రికవరీ చేశామని, వాటి విలువ రూ.64 లక్షలు ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రికవరీకి కృషి చేసిన సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు జి.ప్రేమ్‌కాజల్, వి.ఉమామహేశ్వరరావు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, సైబర్ సెల్ సిబ్బంది రమేష్, శేషగిరి, శరత్, అరవింద్, సత్యనారాయణ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

లుట్టపేటలో పూరిల్లు దగ్ధం

పొందూరు: కొంచాడ పంచాయతీ లుట్టపేట గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. తండ గోపి ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న యువకులు వెంటనే స్పందించి తాటికమ్మలను తొలగించారు. దీంతో పక్క ఇళ్లకు మంటలు వ్యాపించకుండా అడ్డుకున్నారు. ప్రమాదంలో టీవీ వగైరా గృహోపకరణాలతోపాటు వంట సామగ్రి కాలిబూడిదైంది.

గ్రామదేవత ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలు

● సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్

టెక్కలి: సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్ పరిధి కొల్లిపాడు పంచాయతీ గంటపేట గ్రామంలో జరిగిన గ్రామదేవత ఉత్సవాల్లో ఈ నెల 11న రాత్రి కొందరు యువతులు అశ్లీల నృత్యాలు చేసినట్లు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో గత రెండు రోజులుగా హల్‌చల్ చేస్తున్నాయి. వీటిని చూసిన వారంతా ఇదేమి ఘోరమంటూ మండిపడుతున్నారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి అశ్లీల డ్యాన్స్‌లకు పోలీసులు ఎలా అనుమతులు ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై సంతబొమ్మాళి ఎస్ఐ సిద్ధార్థ కుమార్ వివరణ కోరగా.. ఆ రోజు తాను విజయవాడలో బందోబస్తు నిర్వహణలో ఉన్నట్లు చెప్పారు. అశ్లీల నృత్యాల విషయం తెలిసిన తరువాత ఉత్సవ కమిటీ సభ్యులను పోలీసు స్టేషన్‌కు రావాలని చెప్పినట్లు తెలిపారు.

నరసాపురంలో ఇరువర్గాలపై కేసు

సంతబొమ్మాళి: నరసాపురం పంచాయతీ మాల నరసాపురంలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ సిద్ధార్థకుమార్ తెలిపారు. తనను దూషించారని దళిత మహిళ ఎడ్ల ఈశ్వరి ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన ఆవాల సంతు, గోపి, ఇచ్ఛాపురం ఆనందరావు, చిన్ని శ్రీను, మహలక్ష్మి, సుబ్బారావులపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని, అలాగే ఆవాల సంతు ఇతరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈశ్వరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం


రక్తదాతలను సత్కరిస్తున్న దృశ్యం

అరసవల్లి: నగరంలోని ఎస్‌బీఐ బ్యాంకు రీజినల్ కార్యాలయంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లా ఎస్‌బీఐ ఉద్యోగులు, అధికారులు 150 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని రీజనల్ మేనేజర్ ఏహెచ్ అమీర్ ప్రారంభించి మాట్లాడుతూ.. ఉద్యోగులందరూ రక్తదానం చేయడానికి ముందుకు రావడం సంతోషం అన్నారు. కార్యక్రమంలో రీజనల్ సెక్రటరీ వెంకటరమణ, ఆఫీసర్స్ రీజనల్ సెక్రటరీ కృష్ణ కిషోర్, రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు, అన్ని లోకల్ శాఖల సెక్రటరీలు, ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే అత్యధిక సార్లు రక్తదానం చేసి సురేష్, నాగరాజు, జవహర్, వసంత, తిరుపతిరావులను సత్కరించారు.

అనధికార లే అవుట్లపై చర్యలు

ఆమదాలవలస: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో వ్యాపార లాభాపేక్ష ఉద్దేశంతో వేసిన అధికార లే అవుట్లపై చర్యలు తీసుకుంటామని మున్సిపల కమిషనర్ జి.రవి గురువారం ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు. పట్టణంలోని తొమ్మిదో వార్డు మెట్టక్కివలస సర్వే నెంబరు 147లో వేసిన లేఅవుట్ అనధకారింగా వేసినట్టు గుర్తించామన్నారు. ఈ లేఅవుట్‌కు మున్సిపల్ డీటీసీపీ, సుడా నుంచి ఎటువంటి అనుమతలు పొందలేదని, అటువంటి అనధికార లేఅవుట్‌లో స్థలాలు అమ్మకాలు కొనుగోలు చట్టరీత్యా నేరమన్నారు. అక్రమంగా నిర్మాణాలు జరిపితే చట్ట ప్రకారం కూల్చివేస్తామన్నారు.

యోగాతో ఆరోగ్యం

అరసవల్లి: యోగ సాధన చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యాన్ని ఉండొచ్చని శ్రీకాకుళం ఎమ్మెల్యే, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ గొండు శంకర్ అన్నారు. శరీరానికి, మెదడుకు మధ్య గల బంధాన్ని సమన్వయం చేయడానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల ఒత్తిడి, ఆందోళన దూరమవుతాయని, బీపీ, షుగర్ వంటి వ్యాధులు దరిచేరవన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మన భారతీయ సంస్కృతిలో భాగమైన యోగాకు గుర్తింపు దక్కడం గర్వకారణమని, జూన్ 21న అంతర్జాతీయ యోగాడే సందర్భంగా అందరూ సాధనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఇచ్ఛాపురం: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మునిసిపల్ గర్ల్ హైస్కూల్ హెచ్‌ఎం రమణమ్మ కోరారు. మిషన్ లైఫ్ పర్యావరణ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలన్నారు. చెట్లు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ గగన కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెలమాంలో పారిశుధ్య పనులు

ఆమదాలవలస: బెలమాం గ్రామ వీధుల్లో సర్పంచ్ కనుగుల కిషోర్ ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. కాలువల్లో చెత్తను తొలగించి క్లోరినేషన్ చేపట్టారు. గ్రామంలోని రహదారులపై నిలిచిన నీటిని తొలగించి బ్లీచింగ్ చేపట్టారు. అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ కిషోర్ తెలిపారు.

నేటి నుంచి దుర్గాదేవి యాత్ర



జి.సిగడాం: పెంట గ్రామంలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవ యాత్ర శుక్రవారం ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్త డోల రామారావు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ యాత్రలో అమ్మవారికి ముర్రాటలు, కుంకుమ పూజలు, హోమాలతో పాటు తిరువీధి వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తుల వినోదం కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. అలాగే మూడు రోజుల పాటు భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వై.మధుసూధనరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

వ్యవసాయంపై వైసీపీ నిర్లక్ష్యం

● ఎమ్మెల్యే గొండు శంకర్

● వంశధార కుడి కాలువ పరిశీలన

● అధికారుల గైర్హాజరుపై మండిపాటు


చింతాడ వద్ద కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్: మానవ మనుగడకు ప్రధానమైన వ్యవసాయ రంగాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే గొండు శంకర్ మండిపడ్డారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో చింతాడ వద్ద వంశాధార కుడి ప్రధాన కాలువ ఎత్తిపోతల పథకాన్ని, కాలువను ఆయకట్టు రైతులు, టీడీపీ నాయకులతో కలసి గురువారం ఆయన పరిశీలించారు. ప్రధాన కాలువను అనుసరించి అంపోలు వరకు పర్యటించిన ఆయన కాలువ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి వెన్నెముక లాంటి రైతు నడ్డి విరిచేలా గత వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిదన్నారు. గార మండల శివారు భూములకు నీరందించే వంశధార కుడి ప్రధాన కాలువ నిర్వహణ గత ప్రభుత్వం గాలికి వదిలేయడంతో రైతులు నష్టపోయారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కాలువల్లో ఒక తట్టడు మన్ను కూడా తీయలేదని ఆరోపించారు. రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్ర బాబు ప్రధాన లక్ష్యమన్నారు. శివారు భూములకు కూడా సాగు నీరందించేడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందాన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం కాలువ పనులను పరిశీలిస్తానని, శివారు భూము లకు సాగు నీరందించి రైతుకు అండగా ఉంటామని ఎమ్మెల్యే గొండు శంకర్ హామీనిచ్చారు.

అధికారుల గైర్హాజరుపై అసహనం

వంశధార కుడి కాలువల పరిశీలనకు వస్తామని ముందుగానే సమాచారం ఇచ్చినా ఇరిగేషన్ అధికారులు గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే గొండు శంకర్ అసహనం వ్యక్తం చేశారు. పనుల్లో అవకతవకలు జరిగితే గుర్తించాల్సిన అధికారులు మౌనం వహించడం వారి వృత్తికి ద్రోహం చేస్తున్నట్టేనన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం కాలువ పనులు పరిశీలనకు వస్తామని, అప్పటికి అన్ని రిపోర్టులతో పాటు పనులు వేగవంతం కావాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు.

రెవెన్యూ సేవలపై అవగాహన కల్పించాలి

శ్రీకాకుళం అర్బన్: రెవెన్యూశాఖ ద్వారా ప్రజలకు అందించే సేవలపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో సీహెచ్ రంగయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన రెవెన్యూ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ ఎంతో కీలకమైందని, ప్రజలతో రెవెన్యూ ఉద్యోగులు సత్సంబంధాలు కొనసాగించాలని కోరారు. అనంతరం రిటైర్డు ఆర్డీవో పీఎంజే బాబు, రిటైర్డు తహసీల్దార్లు ఎన్ఆర్ రవీంద్రనాథ్, ఎస్.మోహన్‌రావు, డి.చంద్రశేఖర్, జి.సురేష్, పి.రాంబాబులను వారు అందించిన సేవలకు గాను సత్కరించారు. అలాగే పలువురు రెవెన్యూ ఉద్యోగులకు శంకర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్‌ను రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రాణి, డిప్యూటీ తహసీల్దార్ బీవీవీఎస్ రాజు, అరుణ్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ నవీన్ తదితరులు

కలెక్టరేట్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించనున్న కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగా వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, శారీరక, మానసిక ఆరోగ్యం, జ్ఞాపకశక్తి, మానసిక ప్రశాంతత లభిస్తాయని తెలిపారు. ఈ నెల 21న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 6.00 గంటల నుంచి 8.00 గంటల వరకు ఆయుష్‌శాఖ, ఎన్‌వైకే ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఆయుష్ సీనియర్ వైద్యాధికారి జగదీష్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతీ ఆయుష్ పీహెచ్‌సీల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన కరపత్రాలను జేసీ విడుదల చేశారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, డీఈవో వెంకటేశ్వరరావు, యువజన సర్వీసుల శాఖ అధికారి ప్రసాదరావు, సాయ్ చీఫ్ కోచ్ శ్రీధర్, పర్యాటకాధికారి నారాయణరావు, ఎన్‌వైకే సమన్వయకర్త వెంకట్ ఉజ్వల్ తదతరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

సరుబుజ్జిలి: యోగా దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకుంటే ఆరోగ్యం సిద్ధిస్తుందని తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలో యోగాపై అవగాహన ర్యాలీ, సదస్సు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేనకరత్నం, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యుడు పూజారి పురుషోత్తమ రావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల వయసులోనే..


ఆకట్టుకుంటున్న నక్షత్ర ఆసనాలు

శ్రీకాకుళం కల్చరల్: యోగాసనాల్లో ఈ చిన్నారి ప్రతిభను చూసి అంతా ఆశ్చర్యపోవాల్సిందే. నాలుగేళ్ల వయసులోనే వివిధ 24 భంగిమల్లో ఈ చిన్నారి వేస్తున్న ఆసనాలు అబ్బురపరుస్తున్నాయి. శ్రీకాకుళం నగర పరిధి సానా వీధిలో నివాసం ఉంటున్న కలెక్టరేట్‌లో డీటీగా విధులు నిర్వహిస్తున్న బొడ్డేపల్లి శ్రీనివాసరావు, శ్రీలత కుమార్తే ఈ చిన్నారి నక్షత్ర. తల్లిదండ్రులు ప్రతి రోజూ వేస్తున్న ఆసనాలు చూసి అనుకరించి నేర్చుకుంది. దీంతో ఆ చిన్నారి ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు నగరంలోని సూర్య పతంజలి యోగా వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీదేవి వద్ద శిక్షణ ఇప్పించారు. దీంతో ఆ చిన్నారి 24 యోగాసనాలు అవలీలగా వేస్తుంది. ఇటీవల బాపూజీ కళా మందిర్‌లో జరిగిన కార్యక్రమంలో యోగాసనాలు వేసి ఆకట్టుకుంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ ఆ చిన్నారి ప్రతిభను చూసి అభినందించి సత్కరించారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ

ఇచ్ఛాపురం: జాతీయ స్థాయి యోగా పోటీల్లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీకాంత్ మహంతి మూడో స్థానంలో నిలిచి ప్రతిభ చూపాడు. ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొని విన్యాసాన్ని పదర్శించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆగస్టు నెలలో శ్రీలంకలో నిర్వహించనున్న అంతర్జాతీయ పోటోల్లో శ్రీకాంత్ పాల్గొనున్నాడు. శ్రీకాంత్ ప్రతిభచపై పట్టణానికి చెందిన క్రీడాకారులు అభినందించారు.

అవార్డులతో శ్రీకాంత్ →



చందబాబును కలిసిన కూన

ఆమదాలవలస: నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరినట్టు తెలిపారు. అలాగే విద్యాశాఖ మంత్రి లోకేష్, ఆర్అండ్‌బీ మంత్రి జనార్దన రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం-ఆమదాలవలస గుంతల రహదారి దుస్థితిని ఆర్అండ్‌బీ మంత్రికి వివరించినట్టు తెలిపారు.


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

బీసీ మంత్రిని రెడ్డిక సంఘు నాయకులు

ఇచ్ఛాపురం: బీసీ సంక్షేమ శాఖామంత్రి ఎస్. సవితను రాష్ట్ర బీసీ, రెడ్డిక సాధికార సమితీ కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి గురువారం కలుసుకున్నారు. రెడ్డిక సాధికార సమితి డైరెక్టర్ పరపతి అసిరయ్యరెడ్డి, బసవ రాజేశ్వరరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా రెడ్డిక కులానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరినట్టు వారు తెలిపారు.


బీసీ మంత్రితో రెడ్డిక సాధికార సమితి నాయకులు

ఉపాధ్యాయులను వెనక్కి తెప్పించండి


ఎంఈవోను ప్రశ్నిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆమదాలవలస: డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులను వెనక్కి తెప్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంఈవో జి.రాజేంద్రప్రసాద్ పురపాలక సంఘంలోని 14 వార్డు ఐజే నాయుడు కాలనీలోని చిన్ని కృష్ణాపురం ఎంపీయూపీ ప్రభుత్వ పాఠశాల సందర్శనకు వెళ్లగా.. విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడకు చేరుకొని పాఠశాల స్థితిగతులపై వివరించారు. ఈ పాఠశాలలో సుమారు 75 మంది విద్యార్థులకు ఏడుగురు ఉపాధ్యాయులు ఉండేవారన్నారు. గతేడాది డిప్యూటేషన్ పేరుతో ముగ్గురు ఉపాధ్యాయులు ఇక్కడ నుంచి పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు పంపించారన్నారు. వారి స్థానంలో కొత్తగా మరో ముగ్గురు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇక్కడకు తీసుకువచ్చారన్నారు. ఈ నెల 13న పాఠశాలల పునః ప్రారంభం కాగా ఇక్కడి స్కూల్‌కు డిప్యూటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసేశారని, కాని ఇదే పాఠశాల నుంచి డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులను వెనక్కి తీసుకురాకపోవడంపై ఎంఈవోను నిలదీశారు. ఆమదాలవలస మండల మున్సిపాలిటీ పరిధిలోని ఉత్తమ ఉపాధ్యాయలను డిప్యూటేషన్ పేరుతో లక్ష్మీనగర్ మున్సిపాల్ హైస్కూల్‌లో నియమించి, మిగిలిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎంఈవో మాట్లాడుతూ.. మరో వారం రోజుల్లో ఆ ఉపాధ్యాయులు తిరిగి ఇక్కడికి వచ్చేలా చర్యలు తీసుకుంటానని విద్యార్థుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

వసతిగృహం నిర్వహణపై అసంతృప్తి


హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న విశ్వప్రసాద్

బూర్జ: తోటవాడలో ఉన్న ప్రభుత్వ వసతి గృహాన్ని గురువారం మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, ప్రభాకర్ తదితరులు సందర్శించారు. ప్రభుత్వ హాస్టల్‌లో వసతి సదుపాయాలు చాలా దారుణంగా ఉన్నాయని, భోజన సదుపాయం కూడా సరిగా అందడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డెన్ కూడా పూర్తిస్థాయి అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో అక్కడ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రీడింగ్ రూమ్ కేటాయించాలని ఆందోళన


కేంద్ర గ్రంథాలయం వద్ద ఆందోళన చేస్తున్న యువత

అరసవల్లి: రీడింగ్ రూమ్ కేటాయించాలని గురువారం నగరంలోని కేంద్ర గ్రంథాలయం వద్ద యువత ఆందోళన చేశారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే సామాన్య పేద, మధ్య తరగతి విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఏళ్ల తరబడి ఈ సమస్య ఉన్నా పట్టించుకోవడం లేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొండు శంకర్ జోక్యం చేసుకుని ఈ సమస్యకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో మళ్లీ ఈ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం


విరాళాన్ని అందిస్తున్న భక్తుడు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని విశాఖకు చెందిన కేవీ సత్యనారాయణ రాజు గురువారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయల విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తికి అందజేశారు. వారిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, చక్రవర్తి వారికి స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను అందజేశారు.

వరి విత్తనాల పంపిణీ

పొందూరు: ప్రతీఒక్క రైతుకీ వరి విత్తనాలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యంతో గురువారం వివిధ గ్రామాల్లో వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. తాడివలసలో సర్పంచ్ మనెమ్మ, తోలాపిలో టీడీపీ నాయకులు పి.రామారావు, పి.అప్పలనాయుడు, ఎంపీటీసీ కల్యాణి, రాపాకలో బలగ శంకర భాస్కర్, కె.శ్రీనివాస రావు, కె.గిరిబాబు ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ చేశారు.

25 నుంచి స్వయం ఉపాధిపై శిక్షణ

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలో యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఈ నెల 25వ తేదీ నుంచి టైలరింగ్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కల్యారి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళల కోసం టైలరింగ్‌లో 30 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. 19-45 ఏళ్ల లోపు గల మహిళలు శిక్షణకు అర్హులని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాల కోసం 79933 40407, 95534 10809 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

ఐటీఐలో 124 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాల కోసం ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ కొనసాగుతుంది. మూడో రోజైన గురువారం 522 మంది హాజరుకావల్సి ఉండగా 232 మంది హాజరై, 124 మంది వివిధ ఐటీఐల్లో సీట్లు పొందారు. 21న 473 మంది కౌన్సెలింగ్‌కు హాజరుకావల్సి ఉంది. ఈ నెల 23వ తేదీ వరకు ఈ కౌన్సెలింగ్ కొనసాగనుంది. జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎస్.సుధ, జిల్లా కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు పర్యవేక్షణలో ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

ఎక్కువ కేసులు రాజీ చేయించండి

ఇచ్ఛాపురం: లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మన్ పి.పరేష్‌కుమార్ అన్నారు. ఇచ్ఛాపురంలో గురువారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీ మార్గమే రాజమార్గమని, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగయ్యరెడ్డి, సభ్యులు ఎన్‌వీఎస్ రంగారావు, నాగరాజు పాత్రో, బైరాగి, భగవాన్‌దాస్, సీతయ్యరెడ్డి, దేవరాజురెడ్డి, నారాయాణరావు, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

రిటైర్డు హోంగార్డుకు చెక్కు అందజేత

శ్రీకాకుళం క్రైం: ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు గొర్లె రాజుకు ఎస్పీ రాధిక గురువారం చెక్కు అందజేశారు. జిల్లాలో సహచర హోమ్‌గార్డుల ఒక్క రోజు గౌరవవేతనాన్ని సేకరించి రూ.4.17 లక్షలు చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాధిక అందజేశారు.

లఘు చిత్రాలకు నగదు బహుమతి

శ్రీకాకుళం క్రైం: మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా మూడు నిమిషాల లఘు చిత్రాన్ని చిత్రీకరించి ఈ నెల 25వ తేదీలోగా వాట్సాప్ నెంబరు 6309990940 (పీఆర్వో)కు పంపించాలని ఎస్పీ రాధిక గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌డీ క్వాలిటితో వీడియోలు పంపించాలన్నారు. వచ్చిన లఘు చిత్రాల్లో ఎంపికైన వాటికి మొదటి బహూమతిగా రూ.5వేలు, రెండు బహూమతికి రూ.3వేలు నగదు ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే ఈ నెల 26న ఆర్ట్స్ కళాశాల నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తామని, యువత ఉత్సాహంగా పాల్గొనాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల: మండలలోని పలు గ్రామాల్లో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో వినియోగదారులు అవస్థలకు గురవుతున్నారు. చిన్నపాటి గాలి వీచినా, చినుకు రాలినా ముందుగా విద్యుత్ సరఫరాలో సమస్యల ఏర్పడుతున్నట్టు వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తున్నా, పగటి పూట ఉష్ణోగ్రతలు ఏ మాత్రం తగ్గక ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అలాగే రాత్రి పూట విద్యుత్‌లో లోవోల్టేజీ సమస్య, సరఫరా నిలిపేయడం తదితర సమస్యలతో వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు. కొన్నిసార్లు ముందుగా ఎలాంటి సమాచారం లేకుండానే విద్యుత్‌ను తీసేస్తుండడంతో ప్రజల అష్టకష్టాలు పడుతున్నారు. తోటపాలెం, కొత్తపేట, తీరప్రాంత గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలని వినియోగదారులు వాపోతున్నారు. కరెంట్ కష్టాలతో రాత్రి పూట నిద్రకు, ఉదయం నీటి కోసం ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ విషయమై ఏఈ కె.హరికృష్ణ వద్ద ప్రస్తావించగా వాతావరణంలో మార్పులతో గాలులు, పిడుగులు తదితర కారణాల వల్ల విద్యుత్ సరఫరాలో అప్పుడప్పుడు అంతరాయం ఏర్పడుతున్నట్టు చెప్పారు.


ఘనంగా రెవెన్యూ డే

జి.సిగడాం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ డే గురువారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ రెవెన్యూ సిబ్బందిని తోటి సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటూ అందించే సేవలే గుర్తింపునిస్తాయన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

● **సోంపేట:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డేను గురువారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెవెన్యూ విశిష్టతను వివరించారు. సిబ్బంది కిరణ్, విజయ్ తదితరులు ఉన్నారు.

● **బూర్జ:** రెవెన్యూ పరంగా సకాలంలో సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ అంబేడ్కర్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డేను గురువారం నిర్వహించారు. డీటీ సంతోష్‌కుమార్, జడ్పీటీసీ బి.రామారావు, మాజీ జడ్పీటీసీ ఆనెపు రామకృష్ణనాయుడు, సర్వేయర్, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, సహాయకులు పాల్గొన్నారు.

ఎక్కల పాఠశాలలో మ్యాజిక్ షో


మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కంచిలి: ఎక్కల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం మ్యాజిక్ షో నిర్వహించి విద్యార్థులకు ప్రభుత్వ బడులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెజీషియన్ భాస్కరరావు విద్య వల్లన కలిగే లాభాలను మ్యాజిక్ షో ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారావు, కామేష్‌రెడ్డి, జీవితా బెహరా. రూప తదితరులు పాల్గొన్నారు. అలాగే బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని కంచిలి ఎంఈవో శివరాం ప్రసాద్ అన్నారు. అంపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో-2 చిట్టిబాబు, హెచ్‌ఎం భారతి, టి.శ్రీనివాస్ సాహు, శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లను గుర్తించాలి

కంచిలి: బడిఈడు పిల్లలను గుర్తించి బడులకు పంపించేందుకు అధికారులంతా కృషిచేయాలని ఎంపీడీవో వి.నీరజ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంవీకేఎస్ రవి, ఎంఈవో శివరాంప్రసాద్, చిట్టిబాబు, సీఆర్‌టీలు, వెల్ఫేర్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.